# నమస్తే తెలంగాణ
# కరీంనగర్

5 | కరీంనగర్, మంగళవారం 1 అక్టోబర్ 2024 | KARIMNAGAR




పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు, కాంట్రాక్ట్ కార్మికులు

## ఉద్యోగాలను పర్మినెంట్ చేయండి

**సీఐటీయూ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా**

పెద్దపల్లి, సెప్టెంబర్ 30 : తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని, తమకు కనీస వేతనం ₹26 వేలు ఇవ్వాలని కాంట్రాక్టు కార్మికులు డిమాండ్ చేశారు. సోమవారం పెద్దపల్లి కలెక్టరేట్ గేట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాల సలహా మండలిని వెంటనే ఏర్పాటు చేసి, అందులో అన్ని కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. కార్మికులను యజమానులకు బానిసలుగా మార్చే 4 లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని, కార్మికుల వేతనాల జీవోలను సవరించాలన్నారు. పెద్దపల్లి జిల్లాలోని రైస్ మిల్లుల్లో సుమారు 8వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని, వారికి పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్, ఇన్సూరెన్స్ అమలు చేయాలన్నారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు కోల్ ఇండియా మాదిరిగా హైపవర్ కమిటీ వేతనాలు ఇవ్వాలన్నారు. అనంతరం స్థానిక సంస్థల కలెక్టర్ అరుణశ్రీకి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వేల్పుల కుమారస్వామి, ఉపాధ్యక్షుడు ఎన్ భిక్షపతి, ఎం రామాచారి, సహాయ కార్యదర్శులు తాండ్ర అంజయ్య, సీపెల్లి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి సీతక్క, వేదికపై మంత్రి పొన్నం ప్రభాకర్, తదితరులు

## క్షేత్రస్థాయిలో సందర్శించాలి

- పిల్లలంతా అంగన్‌వాడీలకు వచ్చేలా చూడాలి
- బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి
- అధికారులకు మంత్రి సీతక్క ఆదేశం

కరీంనగర్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ) : అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలని రాష్ట్ర మహిళాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమం, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క ఆదేశించారు. సోమవారం కరీంనగర్ జిల్లా పర్యటనకు వచ్చిన ఆమె మానకొండూర్‌లోని బాలికల ఉన్నత పాఠశాలలో పోషణ్ జాతరను ప్రారంభించారు. అనంతరం కరీంనగర్‌లోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మరో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఉమ్మడి జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నూతన సిలబస్ విధానం ద్వారా అంగన్‌వాడీల్లో పూర్వ ప్రాథమిక విద్యను బోధించడంతో అవి సరైన దిశలో పయణిస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని స్పష్టం చేశారు. ప్రతి వారంలో రెండు మూడు రోజులు కలెక్టర్లు, అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి 'అమ్మ మాట అంగన్‌వాడీ బాట' కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాలు ముందున్నాయని, తమ పిల్లలను అంగన్‌వాడీల్లో చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు. అంగన్‌వాడీ టీచర్లు అధునాతన బోధనా పద్ధతులను అలవర్చుకోవాలని, గర్భిణులకు నాణ్యమైన భోజనం అందించడంలో రాజీ పడవద్దని చెప్పారు. కల్తీ సరుకులు సరఫరా చేసినా, ఆహారంలో నాణ్యత కొరవడినా కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుని, లైసెన్స్‌లు రద్దు చేయాలని ఆదేశించారు. తక్కువ బరువు ఉన్న పిల్లలపై శ్రద్ధ చూపాలని, విధుల పట్ల అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని, అంగన్‌వాడీలను ఆకస్మిక తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వృద్ధాశ్రమాల్లో వార్డెన్లు వృద్ధులపై శ్రద్ధ చూపాలని, తల్లి దండ్రుల విషయంలో నిర్లక్ష్యం వహిం చే పిల్లలపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### ప్రతి పల్లె ఆదర్శంగా నిలవాలి

రాష్ట్రంలోని ప్రతి పల్లె ఆదర్శంగా నిలవాలని, అందుకు అధికారులు కృషి చేయాలని పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి సీతక్క సూచించారు. పంచాయతీ రాజ్ శాఖలో పెండింగ్ బిల్లుల అంశం సీఎం రేవంత్ రెడ్డి దృష్టిలో ఉందని, ఈ సమస్యకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందని అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ కార్యదర్శి క్షేత్ర స్థాయిలో పర్యటించి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ఉపాధి హామీ ద్వారా చెక్ డ్యాంలు, మట్టి రోడ్లు, కాలువల నిర్మాణం వంటి ప్రజలకు ఉపయోగపడే పనులు మాత్రమే చేయాలన్నారు. అక్టోబర్ 2 వరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం ముగుస్తుందని, ఆ వెంటనే గ్రామ పంచాయతీల్లో బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించాలని ఆదేశించారు. స్వచ్ఛతాహీ సేవాలో పాల్గొన్న వారందరికీ అభినందన కార్యక్రమం అక్టోబర్ 4,5 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నామని చెప్పారు. సమీక్షా సమావేశంలో మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, మహిళా శిశు సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి వాకాటి కరుణ, డైరెక్టర్ కాంతి వెస్లీ, గ్రామీణాభివృద్ధి కమిషనర్ అనితా రాంచంద్రన్, కలెక్టర్లు పమేలా సత్పతి (కరీంనగర్), సత్య ప్రసాద్ (జగిత్యాల), కోయ శ్రీహర్ష (పెద్దపల్లి), సందీప్ కుమార్ ఝా (సిరిసిల్ల), కరీంనగర్ అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్ పాల్గొన్నారు.

## మొరాయించిన ఎలక్ట్రిక్ బస్సు

తిమ్మాపూర్, సెప్టెంబర్ 30: కరీంనగర్ రీజియన్‌కు కేటాయించిన కొత్త ఎలక్ట్రిక్ బస్సులను ఆదివారం అట్టహాసంగా ప్రారంభించగా, అందులో ఒకటి సోమవారం మొరాయించింది. అంతంత దూరం 'హైదరాబాద్' పోనంటూ ఆగిపోయింది. సోమవారం ఉదయం సుమారు 50 మంది ప్రయాణికులతో కరీంనగర్ నుంచి హైదరాబాద్ బయలుదేరిన ఎలక్ట్రిక్ బస్సు అల్గునూర్ శివారులోని కాకతీయ కాలువ సమీపంలో డివైడర్ వద్ద నిలిచిపోయింది. శబ్దం వచ్చి ఆగిపోయినట్లు ప్రయాణికులు తెలిపారు. కొద్దిసేపు మరమ్మతులకు ప్రయత్నించిన డ్రైవర్.. బస్సు స్టార్ట్ కాకపోవడంతో ప్రయాణికులను వేరే బస్సుల్లో పంపించారు. గంట తర్వాత బస్సు స్టార్ట్ కాగా తిరిగి కరీంనగర్ డిపోకు వెళ్లింది.




అల్గునూర్ శివారులో ఆగిన ఎలక్ట్రికల్ బస్సు

## రెండు బైక్‌లు.. ఒకే నంబర్!



సిరిసిల్ల రూరల్, సెప్టెంబర్ 30 : రెండు బైక్‌లకు ఒకే నంబర్! ఏంటీ ఆశ్చర్యపోతున్నారా! అయితే ఈ ఫొటో చూడండి. మీకే కనపడుతుంది! అలా ఎలా సాధ్యం అనుకుంటున్నారా.. అయితే చదవండి.. తంగళ్లపల్లి మండలానికి చెందిన ఓ ఇద్దరు స్నేహితుల్లో ఒకరి బైక్‌కు రిజిస్ట్రేషన్ కాలేదు. దీంతో మరొకరి బైక్ నంబర్ తన బైక్‌కు వేసుకున్నాడు. వీరిద్దరూ బైక్‌లపై సోమవారం మానేరు వంతెన మీదుగా వెళ్తుండగా.. వెనుక వచ్చిన ఓ వ్యక్తి ఫొటో తీశాడు. ఇది సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసులు ఆరా తీశారు. విచారణ జరిపి, సదరు వాహనదారులపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు.

# వరి బోనస్.. బోగస్



ముత్యంపేట గ్రామ శివారులో సాగవుతున్న దొడ్డురకం వరిపంట

### సర్కారు దొంగదెబ్బపై రైతుల్లో ఆగ్రహం

- ఎన్నికల ముందు అన్ని రకాల వడ్లకు మద్దతు ధరపై ₹500 ఇస్తామని హామీ
- అధికారంలోకి వచ్చాక మాటమార్చిన ప్రభుత్వం
- సన్నాలకే ఇస్తామన్న ప్రకటన
- ఉమ్మడి జిల్లాలో 6.05 లక్షల ఎకరాల్లో దొడ్డురకం సాగే
- 3.90 లక్షల ఎకరాల్లోనే సన్నరకం
- 60శాతం విస్తీర్ణానికి దక్కని ప్రయోజనం
- అయినా సన్నాలకు మార్కెట్‌లో మంచి ధరలు
- బోనస్ ఎందుకూ మొదలుకాదంటున్న రైతులు

కాంగ్రెస్ సర్కారు రైతులను దగా చేసింది. ఎన్నికల ముందు అనేక ఆశలు చూపి, గద్దెనెక్కిన తర్వాత దొంగదెబ్బ తీసింది. అన్నిరకాల వడ్లకు మద్దతు ధరపై క్వింటాల్‌కు ₹500 బోనస్ ఇస్తానని హామీలు గుప్పించిన సీఎం రేవంత్‌రెడ్డి, గెలిచిన తర్వాత దొడ్డురకానికి కాదు, సన్నాలకు మాత్రమే ఇస్తానని మాటమార్చడమే అందుకు నిదర్శనంగా నిలుస్తుండగా, కరీంనగర్ ఉమ్మడి జిల్లా రైతాంగం తీవ్ర నిరాశకు లోనవుతున్నది. ముఖ్యమంత్రి బోగస్ మాటలపై భగ్గుమంటున్నది. ప్రభుత్వ నిర్ణయంతో 60 శాతం విస్తీర్ణంలో దొడ్డురకం సాగు చేసేవారికి ప్రయోజనం దక్కకుండా పోనుండగా, ఆవేదన చెందుతున్నది. సన్నాలకు మార్కెట్‌లో అధిక ధరలున్నాయని, బోనస్‌తో పెద్దగా ప్రయోజనం లేదని చెబుతున్నది. ప్రభుత్వానిది తలా తోక లేని నిర్ణయమని, అన్నిరకాల వడ్లకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నది.



| జిల్లా | వరి సాగు విస్తీర్ణం (ఎకరాల్లో) | దొడ్డురకం (ఎకరాల్లో) | దిగుబడి అంచనా (మెట్రిక్ టన్నుల్లో) | సన్నరకం (ఎకరాల్లో) | దిగుబడి అంచనా (మెట్రిక్ టన్నుల్లో) |
|---|---|---|---|---|---|
| జగిత్యాల | 3,16,000 | 2,31,000 | 6.69లక్షలు | 85,000 | 2.12 లక్షలు |
| పెద్దపల్లి | 2,09,555 | 36,676 | 0.91లక్షలు | 72,879 | 3.97లక్షలు |
| సిరిసిల్ల | 1,95,039 | 1,80,763 | 4.03లక్షలు | 14,366 | 0.34లక్షలు |
| కరీంనగర్ | 2,75,448 | 1,56,948 | 3.76లక్షలు | 1,18,500 | 2.60లక్షలు |
| మొత్తం | 9.96,042 | 6,05,260 | 15.39లక్షలు | 3,90,745 | 9.03లక్షలు |

జగిత్యాల, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి కరీంనగర్ జిల్లా తెలంగాణ రాష్ట్రానికే అన్నం గిన్నెగా పేరుగాంచిన విషయం తెలిసిందే. వరి అత్యధికంగా పండించేది ఇక్కడే. దాదాపు పది లక్షల ఎకరాల్లో ఇక్కడ వరి సాగవుతున్నది. ప్రభుత్వం సన్నాలకు మాత్రమే ₹500 బోనస్ ఇవ్వాలని నిర్ణయించడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 60 శాతం విస్తీర్ణంలో సాగు చేస్తున్న దొడ్డురకం వరి రైతులు నష్టపోనున్నారు. జిల్లాలో నీటి వనరులు ఉన్నప్పటికీ రైతులు వివిధ కారణాలతో దొడ్డురకం సాగువైపుకే మొగ్గుచూపుతూ వస్తున్నారు. మొత్తం 9.96లక్షల ఎకరాల సాగు విస్తీర్ణం ఉంటే అందులో 60శాతం విస్తీర్ణంలో దొడ్డురకాలు సాగు చేశారు. సన్నాల సాగు 40 శాతానికి తక్కువగానే ఉన్నది. పెద్దపల్లి జిల్లా మినహా ఇతర జిల్లాల్లో సన్నాల సాగు అతి తక్కువగా కనిపిస్తున్నది. అలాగే మొత్తం 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అవుతుందని అంచనా వేస్తే, అందులో 15.39లక్షల మెట్రిక్ టన్నులు దొడ్డురకానికి చెందినవే అని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. సన్నాల దిగుబడి కేవలం 9లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే ఉండవచ్చునని అంటున్నారు. ప్రభుత్వం తీసుకున్న బోనస్ నిర్ణయంతో దిగుబడిలో 67శాతానికి 500 బోనస్ రాని పరిస్థితి నెలకొంది.

### సన్నాలకు మార్కెట్‌లో అధిక ధరలు

ప్రభుత్వం సన్నాలకు ₹500 బోనస్ ఇస్తామని ప్రకటించినా, రైతులు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. వాస్తవానికి సన్నాలకు ఓపెన్ మార్కెట్‌లో మంచి ధర పలుకుతుందని చెబుతున్నారు. ప్రభుత్వం క్వింటాల్‌కు ₹2,300 మద్దతు ధర ఇస్తున్నది. ఏ గ్రేడ్‌కు ₹2,320 చెల్లిస్తున్నది. ఈ లెక్కన సన్నాలు విక్రయిస్తే బోనస్ ₹500తో కలిపి క్వింటాల్‌కు ₹2,820 గరిష్ఠంగా వస్తాయని, అదే బయట మార్కెట్‌లో ఎక్కువ ధర వస్తుందని, ప్రైవేట్ వ్యక్తులతోపాటు పలు కంపెనీలు అధిక ధరను ఇచ్చి కొనుగోలు చేస్తున్నారని రైతులు పేర్కొంటున్నారు. సన్నాలకు ప్రస్తుతం మార్కెట్‌లో ₹2,700 నుంచి ₹2,800 పలుకుతున్నదని, ఇంకా ఎక్కువ పలికే అవకాశం ఉందని చెబుతున్నారు.

### జగిత్యాలలో ఒప్పంద సాగు

జగిత్యాల జిల్లాలో 85వేల ఎకరాల్లో సన్నాలు సాగవుతుండగా, అందులో మెజార్టీ శాతం ఒప్పంద వ్యవసాయమేనని రైతులు చెబుతున్నారు. వానకాలం పంట ప్రారంభం కంటే ముందే పయనీర్, కావేరి, బేయర్, మహేంద్రలాంటి ప్రముఖ కంపెనీలు పలువురు రైతులతో ఒప్పందం కుదుర్చుకొని సన్నాలు సాగు చేయిస్తున్నాయి. క్వింటాల్‌కు ₹2,600 నుంచి ₹2800 చెల్లించేలా ఒప్పందాన్ని చేసుకున్నారు. ఒకవేళ ప్రభుత్వం ₹500 బోనస్ ప్రకటిస్తే, ప్రతి క్వింటాల్‌కు అంత మొత్తంలో చెల్లించేందుకు అంగీకారం చేసుకున్నారు. ఈ లెక్కన ఒప్పందం కుదుర్చుకొని సన్నాలు సాగు చేస్తే క్వింటాల్‌కు ₹3,100 నుంచి ₹3,300 ధర పడుతుందని, ప్రభుత్వం ₹2800 ఇవ్వడం ఎంత వరకు సమంజసమని రైతులు ప్రశ్నిస్తున్నారు.

### సన్నాల సాగుకు కష్టాలు ఎక్కువ

మార్కెట్‌లో అత్యంత గిరాకీ ఉన్న సన్నాలకు బోనస్ ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని రైతులు వ్యాఖ్యానిస్తున్నారు. వాస్తవానికి దొడ్డురకం కంటే సన్నరకం సాగు చేయడం కష్టంతో, ఇబ్బందులతోను కూడుకున్న పని. సహజంగా దొడ్డురకం వడ్ల పంటకాలం 135 రోజులు. సన్నవడ్ల పంటకాలం 165 రోజులు. నెల రోజులు అదనంగా రైతు శ్రమించాల్సి వస్తుంది. అలాగే పంటపెట్టుబడి సైతం పెరుగుతుందని, సాధారణ రకాల సాగు పెట్టుబడితో పోలిస్తే ₹4వేల నుంచి ₹5వేల వరకు అధికం అవుతుందని రైతులు చెబుతున్నారు. అలాగే సన్నాలకు నల్లకాటుక రోగం, దోమపోటు, మెడవిరుపు, సుడిదోమ పోటు వంటి ప్రమాదకరమైన చీడపీడలు సోకే ప్రమాదం ఉందని, అవి సోకితే పెట్టుబడి మరింతగా పెరుగుతుందని వాపోతున్నారు. అలాగే దిగుబడి సైతం సాధారణ రకంతో పోలిస్తే తక్కువగా ఉంటుందని, ఎకరాన సన్నాలు 23 నుంచి 25 క్వింటాళ్ల మధ్య దిగుబడి ఉంటుందని, దొడ్డురకానికి చెందినవి ఎకరానికి 29 నుంచి 30 క్వింటాళ్ల వరకు దిగుబడి ఉంటుందంటున్నారు. వ్యయప్రయాసాలకు ఓర్చి చేసిన సన్నాలకు కేవలం ₹500 బోనస్ ప్రకటించడం అత్యంత దుర్మార్గమని వారు విమర్శిస్తున్నారు.

### లక్షల మంది రైతులకు మొండిచేయి

దొడ్డరకం సాగు చేస్తున్న లక్షలాది మంది రైతులకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధర విషయంలో మొండిచేయి చూపింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 6లక్షల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో దొడ్డురకం సాగు చేసే 5లక్షల మందికి పైగా రైతులకు తీవ్ర నిరాశను కలిగించింది. మద్దతు ధరపై ₹500 బోనస్ ప్రకటనకు ముందు రైతులు తమకు ప్రయోజనం కలుగుతుందని కొంత ఆనందించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ₹1200 కోట్ల వరకు రైతులకు బోనస్ రూపంలో వస్తుందని ఆశించారు. అయితే ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం నేపథ్యంలో సన్నాల దిగుబడి అంచనాలను బట్టి ₹450 కోట్లకు మించి బోనస్ వచ్చే అవకాశం లేదని అధికారులు అంచనా వేస్తున్నారు. దొడ్డురకం సాగు చేసిన రైతులు దాదాపు ₹769 కోట్లు నష్టపోయినట్లేనని వారు అభిప్రాయపడుతున్నారు. అయితే ప్రభుత్వం సన్నాలకు ఇచ్చే బోనస్‌ను అతి తక్కువ మంది రైతులు వినియోగించుకునే అవకాశాలున్నాయని, మెజార్టీ రైతులు బహిరంగ మార్కెట్‌లో విక్రయించుకునే అవకాశాలున్నాయని మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం చేసిన బోనస్ ప్రకటన వల్ల ఉమ్మడి జిల్లా పరిధిలోని రైతులకు పెద్దగా ప్రయోజనం చేకూరదని, పైగా దొడ్డురకం వరి వెరైటీని సాగు చేసిన రైతులకు నష్టం కలుగుతుందని చెబుతున్నారు.



### ప్లేటు ఫిరాయించిండు

చిన్నప్పుడు ఒక కథ విన్న. అదేంటి అంటే ఒక ఊర్లో ఒక పెద్ద గుట్ట ఉంటది. అట్లనే పెద్ద చెరువు ఉంటది. ఒకరోజు ఆ ఊరికి ఒక వ్యక్తి అచ్చి, నేను ఆ గుట్టను మోస్త, ఆ చెరువులోని నీళ్లను తాగుత అంటడు. బాతాలు కొడుతడు. నీతోని కాదని ఊరోళ్లందరూ అంటే, 'నేను నిజం చెబుతున్న. కావాలంటే మీకు చూపిస్త' అని అంటడు. దీంతో ఊరోళ్లందరు ఒక రోజు అందరూ జమై, పనులన్నీ వదలుకొని గుట్ట దగ్గరికి వస్తరు. అందరూ ఆశ్చర్యంగా చూస్తూ ఉంటరు. హామీ ఇచ్చిన వ్యక్తి 'నేను గుట్టను మోసేందుకు సిద్ధం. గుట్టను ఎత్తి నా భుజాలపై పెట్టుర్రి' అంటడు. అదేంటి గుట్టను మోస్త అంటివి కదా! అని ఊరోళ్లు అంటే.. 'నేను ఏమని చెప్పిన. గుట్టను మోస్త అన్న. గుట్టను ఎత్తుత అనలేదు. మీరు ఎత్తుర్రి, నేను మోస్త' అని అనడంతో అందరూ ఆశ్చర్యపోతరు. మరి చెరువుల నీళ్ల సంగతి ఏంటీ అంటే.. చెరువులకు వెళ్లి ఒక దోశెడు నీళ్లు తాగుతడు. అదేంటి? మొత్తం తాగవా.. అంటే, లేలే.. నేను ఏం చెప్పిన. చెరువుల నీళ్లు తాగుత అన్న కనీ, అన్ని నీళ్లు తాగుత అని అన్ననా..? అని చెప్పుడుతోటి ఊరోళ్లందరు తప్పుడు ముచ్చట్లు చెప్పినోన్ని ఉరికిచ్చి కొడుతరు. ఈ కథ అచ్చం మన సీఎం రేవంతం సార్ చెప్పినట్టే ఉన్నది. ఎన్నికల ముందు వడ్లకు మద్దతు ధరపై క్వింటాల్‌కు ₹500 బోనస్ ఇస్తా అని చెప్పి, గెలిచిన తర్వాత సన్నాలకే ఇస్తా అని ప్లేటు ఫిరాయించిండు. ఇది కరెక్ట్ కాదు. మరి దొడ్డు వడ్లు సాగు చేసే రైతు ఏం కావాలి? అన్ని రకాల వడ్లకు ఇయ్యాలె.

**- బద్దం రాంచంద్రారెడ్డి, రైతు (ముత్యంపేట)**



### అన్ని వడ్లకూ బోనస్‌కూ ఇవ్వాలి

కాంగ్రెస్ ఎన్నికల సమయంలో కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి వరి ధాన్యం క్వింటాలుకు ₹500 బోనస్ ఇస్తానని హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక కేవలం సన్న రకాలకు మాత్రమే ఇస్తామని, దొడ్డు రకాలకు ఇవ్వనని తిరకాసు పెడుతున్నది. నూటికి 95 శాతం మంది రైతులు దొడ్డు రకాలను మాత్రమే సాగు చేసిన్రు. తద్వారా ప్రభుత్వం ఇచ్చే బోనస్ సన్న రకాలకు మాత్రమే ఇస్తామంటే, దొడ్డు రకాలు సాగు చేస్తున్న రైతులకు ఏం ప్రయోజనం? ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదు కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం దొడ్డు, సన్న రకాలు అనే తేడా లేకుండా బోనస్‌ను వర్తింపజేయాలి.

**- సుధాకర్ గౌడ్, రైతు (తక్కళ్లపల్లి)**



కరీంనగర్: పారిశుధ్య కార్మికురాలికి పీపీఈ కిట్‌ను అందజేస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్, మేయర్ సునీల్‌రావు, కలెక్టర్ పమేల సత్పతి, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

## కార్మికుల కృషితోనే అవార్డులు

- పరిశుభ్రతలో కరీంనగర్ మున్సిపల్ కార్మికుల కృషి భేష్
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్ కార్పొరేషన్, సెప్టెంబర్ 30 : పారిశుధ్య కార్మికుల కృషితోనే కరీంనగర్ నగరపాలక సంస్థకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పలు అంశాల్లో అవార్డులు వచ్చాయని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. మనుసు మంచిగుంటే మంచి ఆలోచనలు వస్తాయని, సమాజానికి మంచి జరుగుతుందని, అందుకే ముందు మనసులో పేరుకుపోయిన మురికి కంపును తొలగించుకోవాలని సూచించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా కరీంనగర్‌లోని సప్తగిరికాలనీలోని వాహన షెడ్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ జరిగిన పారిశుధ్య పనుల్లో పాల్గొని చెత్త ఊడ్చారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 'మానవ సేవ మాధవ సేవ' అనే గాంధీ మాటలను ఆచరించాలని, స్వచ్ఛత జీవన విధానంగా మార్చుకోవాలని సూచించారు. స్మార్ట్‌సిటీ నిధులను కేంద్రం మంజూరు చేసిందని, రాష్ట్ర ప్రభుత్వం కూడా వెంటనే మ్యాచింగ్ గ్రాంట్‌ను విడుదల చేసి అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఎన్నికల వరకే రాజకీయాలని, ఆ తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పని చేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కర్నూలులో వరదలొచ్చినప్పుడు కరీంనగర్ సఫాయి కార్మికులు వెళ్లి పనిచేసి ప్రశంసలందుకున్నారని, కొవిడ్ సమయంలో చేసిన సేవలను మరువలేమని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి, నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, కార్పొరేటర్లు చాడగోండ బుచ్చిరెడ్డి, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినికి కరెంట్ షాక్

గంగాధర, సెప్టెంబర్ 30 : గంగాధర మండలంలోని మధురానగర్ గ్రామ పంచాయతీ పరిధిలోలోని బీసీ బాలికల గురుకుల పాఠశాలలో ఆదివారం ఉదయం విద్యుత్ షాక్‌తో విద్యార్థిని గాయపడింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. పాఠశాలలో 6వ తరగతి విద్యార్థి మందల దీక్షిత ఆదివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో స్నానం చేస్తుండగా బల్బుకోసం ఏర్పాటు చేసిన వైర్ ఆమె కుడిచేతికి తగిలి షాక్ కొట్టింది. దీంతో ఉపాధ్యాయులు విద్యార్థినిని దవాఖానకు తీసుకువెళ్లి చికిత్స చేయించారు. కాగా, ఘటన జరిగిన 24 గంటల తర్వాత సోమవారం సాయంత్రం 4 గంటలకు విద్యార్థిని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో పాఠశాలకు చేరుకున్న వారు 'కరెంట్ షాక్ కొట్టిన 24 గంటల తర్వాత సమాచారం ఇస్తారా?, పిల్లలపై ఇంత నిర్లక్ష్యమెందుకు?' అంటూ ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జరిగిన ఘటనపై ప్రిన్సిపాల్ మంజులకు ఫోన్ చేస్తే స్పందించలేదని తల్లిదండ్రులు తెలిపారు. కాగా, ఘటనపై ప్రిన్సిపాల్‌ను ఫోనులో వివరణ కోరడానికి ప్రయత్నించగా స్పందించలేదు.


